సేవలు విస్తృతం.. పరిధి పరిమితం

కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి సమస్యల సుస్తీ

- ఏళ్లు గడిచినా కార్యరూపం దాల్చని సీహెచ్‌సీ ప్రతిపాదన
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అరకొరగా మందులు
- కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు

- వార్త 5వ పేజీలో..

నేడే పింఛన్ల పండగ

ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీకి సర్వం సిద్ధం

- జిల్లాలో లబ్ధిదారులు 2,64,526 మంది
- ప్రభుత్వం కేటాయించిన నిధులు రూ.174 కోట్లు



- ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి 1,000 చొప్పున కలిపి ఒక్కొక్కరికి 7,000 అందజేత
- ఇంటి వద్దే పంపిణీకి ఏర్పాట్లు
- కార్యక్రమాల్లో పాల్గొననున్న స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సోమవారం పింఛన్ల పండగ ప్రారంభంకానుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్ల నగదును పంపిణీ చేయనుంది. ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని ఇప్పటికే సచివాలయ సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి 1,000 చొప్పున కలిపి ఒక్కొక్కరికి రూ.7 వేలు వంతున అందజేయనున్నారు. ఎన్టీఆర్ భరోసా కింద అన్ని రకాల పింఛన్ల నిమిత్తం జిల్లాకు రూ.174 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. అన్ని నియోజకవర్గాల్లో పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాలను పండగ వాతావరణంలో జరపాలని అధికారులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు.

జిల్లాలో డీఆర్‌డీఏ గణాంకాల ప్రకారం వివిధ రకాల పెన్షన్ లబ్దిదారులు 2,64,526 మంది ఉన్నారు. వీరిలో 1,37,901 మంది వృద్ధాప్య పెన్షన్‌దారులు, వితంతువులు 65,015 మంది, దివ్యాంగులు 31,366 మంది, చేనేత కార్మికులు 2,504, అభయహస్తం 11,880, మత్స్యకారులు 3,374, ఒంటరి మహిళలు 5,812 మంది, గీత కార్మికులు 2,436, ట్రాన్స్‌జండర్స్ 23 మంది, డప్పు కళాకారులు 1,304 మంది, వృత్తి కళాకారులు 1,122 మంది, కళాకారులు 27 మంది, సైనిక్ వెల్ఫేర్ పెన్షన్‌దారులు 15 మంది, డయాలసిస్ పేషెంట్లు 186 మంది, మంచాన పడివున్న రోగులు 201 మంది, ఇతరత్రా వ్యాధులు గలవారు 1,359 మంది ఉన్నారు. వీరందరికీ సోమవారం ఉదయం నుంచే పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు జిల్లాలో 24 మండలాల్లో జరగబోయే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రూ.3 వేల పింఛన్ నగదును రూ.4 వేలు చేసి లబ్ధిదారులకు అందించనుంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.1000 చొప్పున కలిపి ఒక్కొక్కరికి రూ.7 వేలు అందించనుంది. దివ్యాంగులకు గతంలో చెల్లించిన రూ.3 వేలు పెన్షన్‌ను ఇకముందు రెట్టింపు చేసి రూ.6 వేలు అందిస్తారు.

సాగునీటి వనరులపై శ్రద్ధ



పొదలతో ఉన్న పెద్దేరు కాలువ ప్రధాన కాలువ

అత్యవసర పనులు చేపట్టే యోచనలో కూటమి ప్రభుత్వం

- ఉమ్మడి జిల్లాలో రూ.13 కోట్లతో ప్రతిపాదనలు
- కాలువల్లో పూడికతీత, గండ్లు పూడ్చివేత, షట్టర్లు, గ్రోయిన్లకు మరమ్మతులు
- ఖరీఫ్‌లో సాగునీటికి అంతరాయం లేకుండా చర్యలు

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వనరుల మరమ్మతులు, నిర్వహణపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఐదేళ్లపాటు చిన్నపాటి మరమ్మతులు చేయలేదు సరికదా అత్యవసర పనులకు కూడా పైసా విదల్చలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులు, చిన్ననీటి వనరులు, నదుల్లో ఉన్న గ్రోయన్ల మరమ్మతులు అటకెక్కడంతో రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సాగునీటి వనరులకు సంబంధించి అత్యవసర పనులు, కాలువల్లో పూడికతీత, గండ్లు పూడ్చివేత, చిన్నపాటి నిర్మాణాలు, షట్టర్లు, గ్రోయన్ల మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లాలో అత్యవసర పనులకు రూ.13 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. తాండవ ప్రాజెక్టు పరిధిలో కాలువలు, ఇతరత్రా మరమ్మతులకు రూ.1.8 కోట్లు, రైవాడ, కోనాం, పెద్దేరు ప్రాజెక్టు పరిధిలో పనులకు రూ.3.3 కోట్లు, చిన్ననీటిపారుదల ప్రాజెక్టులు, చెరువులు, నదుల్లో గ్రోయన్లు, గండ్లు పూడ్చివేతకు రూ.7.7 కోట్లతో పనులు చేయాలని ప్రతిపాదించారు. ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల వనరుల ద్వారా 4.25 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. గడచిన ఐదేళ్లలో కాలువల్లో ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో ఎక్కడక్కడా మట్టి పేరుకుపోవడం, చెట్లు, పొదలు పెరగడంతో నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రాజెక్టుల పరిధిలో శివారు భూములకు నీరు అందని పరిస్థితి నెలకొనడంతో చాలా ప్రాంతాల్లో పంటలపై తీవ్ర ప్రభావం నెలకొంది. చెరువులు, కాలువలకు ఎక్కడక్కడా గండ్లు పడడం,



పొదలు, చెత్తాచెదారంతో ఉన్న కేఎం చానల్

షట్టర్లు పాడవడం, నదుల్లో గ్రోయన్లు కొట్టుకుపోవడంతో పొలాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు వచ్చాయి. దీనిపై రైతులు మొర పెట్టుకున్నా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. అయితే గత వారం జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నతాధికారులతో సమీక్షించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో అత్యవసర పనుల కోసం రూ.13 కోట్లతో ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలపై వచ్చే ఒకటో తేదీన విజయవాడలో నిర్వహించే సమావేశంలో చర్చించనున్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే పనులు చేయడానికి అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

అరకు కాఫీ అమోఘం

అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన జీసీసీకి ప్రధాని ప్రశంసలు

- మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావన
- ఆనందం వ్యక్తం చేసిన జీసీసీ ఎండీ సురేశ్‌కుమార్



చంద్రబాబునాయుడుతో కలిసి 2016లో అరకు కాఫీ రుచి చూస్తున్న ప్రధాని మోదీ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూన్ 30: అరకు కాఫీ రుచి అమోఘమని, కాఫీకి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడంలో విశేష కృషిచేస్తున్న జీసీసీ సేవలు అభినందనీయమని ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా మన్యం ప్రాంతంలో జీసీసీ, ఏపీ ప్రభుత్వం సహకారంతో గిరిజనులు సాగు చేస్తున్న అరకువ్యాలీ కాఫీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మన దేశ ఉత్పత్తులు ప్రపంచస్థాయి గుర్తింపు సాధిస్తుండడం భారతీయులంతా గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలో గిరిజనులు అధిక విస్తీర్ణంలో కాఫీ పంట సాగు చేస్తున్నారని, శ్రేష్ఠమైన అరోమా రుచి కలిగిన అరకు కాఫీ మంచి గుర్తింపు పొందిందన్నారు. 1.50 లక్షల ఆదివాసీ కుటుంబాలు అరకు కాఫీ సాగు, ఉత్పత్తి, విక్రయాలతో ఆర్థిక సాధికారత సాధిస్తున్నారని కొనియాడారు. గతంలో విశాఖను సందర్శించినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి అరకు కాఫీని ఆస్వాదించే అవకాశం లభించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. కాగా అరకు వ్యాలీలో కాఫీ సాగు, గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం, జీసీసీ అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించడం గర్వంగా ఉందని జీసీసీ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేశ్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.

ఫార్మా వ్యర్థాలపై భరిణికం గ్రామస్థుల ఆందోళన

- మల్లోడి గెడ్డలో జలాలు పరిశీలన
- రాంకీ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

- 5లో

విద్యాశాఖలో వింత పోకడ

విడుదల కాని నిధులకు లెక్కలు చెప్పాలంట!

- పాఠశాల నిర్వహణ నిధుల జమా ఖర్చులపై ఆడిట్
- జిల్లాలో 704 పాఠశాలల రికార్డుల పరిశీలన
- నేడు నర్సీపట్నం, రేపు కశింకోటలో రికార్డుల తనిఖీ



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

విద్యాశాఖలో వింత పోకడలు చోటు చేసుకుంటున్నాయి. గత వైసీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు (స్కూల్ గ్రాంటు) ఒక్క పైసా విడుదల చేయకపోయినా నిధుల ఖర్చుపై ఆడిట్ చేయాలంటూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం చర్చకు దారి తీసింది.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరుతో విద్యా శాఖలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు సుద్దముక్కలు, ఇతరత్రా స్టేషనరీ ఖర్చులు, మరుగుదొడ్ల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వ నిధులను శిక్షా అభియాన్ నుంచి విద్యార్థుల సంఖ్య ఆధారంగా విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రతి పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.10 వేలు నుంచి రూ.1.5 లక్షల వరకు మంజూరు చేయాలనే నిబంధన ఎప్పటి నుంచో అమలులో ఉంది. కానీ గత వైసీపీ పాలనలో ఏనాడూ పాఠశాల నిర్వహణ నిధులు సకాలంలో విడుదల చేసిన సందర్భాలు లేవు. ఏడాది పొడవునా ఉపాధ్యాయులు అప్పులు చేసి ఖర్చు చేస్తే విద్యా సంవత్సరం ముగిసే కాలంలో అరకొరగా నిధులు కేటాయింపులు జరిగేవి. కాగా 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లాకు విడుదల చేయాల్సిన పాఠశాల నిర్వహణ నిధుల కోసం జిల్లా విద్యాశాఖాధికారులు ఎన్ని ప్రతిపాదనలు పంపినా పైసా విదల్చలేదు. ఉపాధ్యాయులే అప్పులు చేసి సుద్దముక్కలు, స్టేషనరీకి సొంతంగా ఖర్చు చేశారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాకు విడుదల కాని సర్వశిక్షా అభియాన్ పాఠశాలల నిర్వహణ నిధుల ఖర్చుపై విద్యాశాఖాధికారులు ఆడిట్ నిర్వహించాలని ఆదేశించడంపై ఉపాధ్యాయ వర్గాలు అవాక్కయ్యాయి. అసలు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా తాము సొంతంగా అప్పులు చేసి ఖర్చు చేసిన నిధులపై ఆడిట్ జరపడం ఏమిటనే ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

తొలి విడత 704 పాఠశాలల రికార్డుల ఆడిట్

జిల్లాలో 24 మండలాలు ఉండగా తొలి విడతగా జూలై ఒకటో తేదీ నుంచి నర్సీపట్నంలో, అదే విధంగా 2న కశింకోటలో విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు హాజరై తమ రికార్డులను ... మిగతా 6వ పేజీలో

ఆడిట్ వల్ల సమయం వృథా

జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాలలకు నిర్వహణ నిధులు విడుదల చేయలేదు. ఆడిట్ నిర్వహించడం వల్ల సమయం వృథా అవుతుంది తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదు. విడుదల కాని నిధుల కోసం పాఠశాలల ఉపాధ్యాయులను పిలిపించి కాలం వృథా చేయడం కంటే అధికారులు పునరాలోచించుకొని ఆడిట్‌ను వాయిదా వేయాలి. ఈ మేరకు విద్యాశాఖాధికారికి వినతి పత్రం అందజేశాం.

- గొంది చినబ్బాయ్,
యూటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి



జి.వెంకటాపురంలో మూతపడిన రక్షిత నీటి ప్లాంట్

రక్షిత నీటి ప్లాంట్లకు మోక్షం కలిగేనా?

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు

- రూ.2లకే 20 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు అందజేత
- వైసీపీ అధికారంలోకి వచ్చాక మూసివేత
- కూటమి ప్రభుత్వం రావడంతో ప్రజల్లో చిగురించిన ఆశలు

మాకవరపాలెం, జూన్ 30:

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన రక్షిత నీటి ప్లాంట్లు వైసీపీ అధికారంలోకి వచ్చాక మూతపడ్డాయి. గత ఐదేళ్లుగా జి.వెంకటాపురం, జి.కోడూరు, జి.నగరం, జెడ్.గంగవరం గ్రామాల ప్రజలకు రక్షిత మంచినీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో 2016 సంవత్సరంలో అప్పట్లో టీడీపీ ప్రభుత్వం జి.వెంకటాపురం, జి.కోడూరు, జి.నగరం, జెడ్.గంగవరం గ్రామాల్లో రక్షిత నీటి ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వీటిని అప్పటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఒక్కో ప్లాంటును రూ.7.5 లక్షలతో ఏర్పాటు చేయగా ఆయా గ్రామాల్లో వాటి ద్వారా తాగునీరు అందేది. రూ.2లకు 20 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు అందించి, వచ్చిన ఆదాయాన్ని నిర్వహణ సిబ్బంది వేతనాలకు చెల్లించేవారు. టీడీపీ అధికారంలో ఉండగా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేది. అయితే 2019లో వైసీపీ అధికారంలో రావడంతో ఏడాది కాలంలోనే ఈ నాలుగు గ్రామాల్లో రక్షిత నీటి ప్లాంట్లు మూతపడ్డాయి. వీటిని పట్టించుకునే నాథుడు లేక లక్షలాది రూపాయలు వృథా అయ్యాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు లభించక అధిక ధర చెల్లించి వాటర్ క్యాన్లను కొనుగోలు చేసుకోవలసి వస్తోంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రక్షిత నీటి ప్లాంట్లకు మంచి రోజులు వస్తాయని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సంక్షేమానికి పూర్వ వైభవం!

వైసీపీ హయాంలో బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలు నిర్వీర్యం

- టీడీపీ హయాంలో ఆయా కార్పొరేషన్ల ద్వారా పెద్దఎత్తున సాయం
- సబ్సిడీపై రుణాలు, 'ఆదరణ' కింద పరికరాలు పంపిణీ
- తాజాగా కూటమి అధికారంలోకి రావడంతో పథకాలన్నీ పునఃప్రారంభమవుతాయని ఆశలు



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం కింద లబ్ధిదారుడికి ఆటో అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో సంక్షేమం పట్టాలెక్కనుంది. బీసీ, ఎస్సీ, మైనారిటీలకు ఆర్థికంగా, సామాజికంగా భరోసా కల్పించేందుకు, ఆయా సామాజికవర్గాల యువతకు ఉపాధి చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోబోతోంది. వారికి రాయితీ రుణాలు అందించి ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన సంక్షేమ శాఖలు గడిచిన ఐదేళ్లలో పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. ఈ శాఖలకు జగన్ ప్రభుత్వ హయాంలో పని లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంక్షేమ శాఖలకు ఊపిరిలూదుతారనే ఆశలు రేకెత్తుతున్నాయి.

తెలుగుదేశం అధికారంలో ఉండగా 'ఆదరణ' పథకం ప్రవేశపెట్టి కులవృత్తుల వారికి నాణ్యమైన పరికరాలను, సబ్సిడీతో కూడిన రుణాలను అందించింది. కాగా జగన్ ప్రభుత్వం ఆయా వర్గాలను పూర్తిగా విస్మరించింది. ఆదరణ లాంటి పథకాలను ఎత్తివేసింది. సంక్షేమ శాఖలను నిర్వీర్యం చేసింది. ఈ నేపథ్యంతో తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఆయా పథకాలను పునఃప్రారంభిస్తామని చంద్రబాబు ప్రకటించారు. తాజాగా కూటమి అధికారంలోకి రావడంతో ఆయా వర్గాల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. గతంలో చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉండగా వందలాది మందికి సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో సబ్సిడీతో కూడిన రుణాలు అందించారు. ఐదేళ్ల కాలం (2014-2019)లో జిల్లాలో సుమారు రూ.రెండు వేల కోట్ల విలువైన సబ్సిడీ రుణాలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలు అందించారు. మరో ఆరు వేల మందికి స్వయం ఉపాధి పరికరాలను ఇచ్చారు. ముఖ్యంగా రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఇతర కులవృత్తులు చేసుకునే వారికి అవసర మైన పరికరాలను అందించారు. వీటితో పాటు సబ్సిడీ రుణాలు తీసుకున్న ఎంతోమంది కోళ్ల, పాడి పరిశ్రమ, చిరు వ్యాపారాలు, ఇతర వృత్తి సంబంధమైన దుకాణాలను ఏర్పాటుచేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

బటన్ నొక్కుడుకే పరిమితమైన జగన్

గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ బటన్ నొక్కుడు పథకాలకే ప్రాధాన్యం ఇచ్చారు. బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలను పూర్తిగా పక్కన పెట్టేశారు. ఆయా శాఖల అధికారులకు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేయడం, సెంట్రల్ ఆఫీస్‌కు పంపించడం మినహా మరో పనిలేకుండా పోయింది. కార్యాలయాల నిర్వహణకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యుత్ చార్జీలు చెల్లించలేని దుస్థితి ... మిగతా 6వ పేజీలో

ఐదు తరగతులు... ఐదుగురే విద్యార్థులు

- ఇదీ చినబొడ్డేపల్లి ఎంపీపీ పాఠశాల పరిస్థితి

కోటవురట్ల, జూన్ 30:

మండలంలోని చినబొడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒకరు చొప్పున ఐదు తరగతులకు ఐదుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరికి ఒక్క ఉపాధ్యాయుడే విద్యా బోధన చేస్తున్నారు. ఈ పాఠశాలను వేరొక పాఠశాలలో విలీనం చేయడానికి అవకాశం లేక ఇలాగే కొనసాగిస్తున్నారు.

మండలంలోని చినబొడ్డేపల్లి ఎంపీపీ పాఠశాలలో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల మండల కేంద్రానికి సుమారు 28 కిలో మీటర్ల దూరం లో ఉంది. గతంలో ఈ పాఠశాలలోని పలువురు విద్యార్థులు కోటవురట్ల కస్తూర్బాయి పాఠశాలలో, బీసీ వసతి గృహంలో చేరడంతో ఇక్కడ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో విద్యాశాఖాధికారులు పాఠశాల మౌలిక



చినబొడ్డేపల్లి ఎంపీపీ పాఠశాల

సదుపాయాల కల్పనకు నాడు- నేడు పథకం కింద అభివృద్ధి నిధులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. ఈ పాఠశాలను విలీనం చేయడానికి సమీపంలో పాఠశాలలు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఐదుగురు విద్యార్థులతోనే కొనసాగిస్తున్నారు.



ఐదుగురు విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు అర్జున

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


దొరబాబు (ఫైల్)

బుచ్చెయ్యపేట, జూన్ 30: రోడ్డు ప్రమాదంలో వడ్డాదికి చెందిన యువకుడు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వడ్డాదికి చెందిన అడపా దొరబాబు (45) ఒడిశాలోని జగదాల్‌పూర్‌లో తన కారును ఓ కంపెనీకి అద్దె ప్రాతిపదికపై నడుపుతున్నాడు. ఆ క్రమంలో జగదల్‌పూర్‌లో శనివారం రాత్రి కారు నడుపుతుండగా వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే దొరబాబు మృతి చెందాడు. దొరబాబు మృతితో భార్య, ఇద్దరు కుమారులు, తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దొరబాబు మృతదేహం సోమవారం వడ్డాది చేరుకుంటుందని కుటుంబీకులు తెలిపారు.

కారు ఢీకొని భార్య, భర్తకు గాయాలు

నక్కపల్లి, జూన్ 30: ఉపమాక హైవే జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య భర్త తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. నక్కపల్లికి చెందిన లోడ సూర్యారావు, అచ్చియ్యమ్మ దంపతులు బైక్‌పై తునిలో ఉన్న తన మనుమరాలిని చూసి తిరిగి వస్తున్నారు. ఉపమాక హైవే జంక్షన్ వద్దకు చేరుకుని మలుపు తిరుగుతుండగా, విశాఖ వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇరువురికీ గాయాలయ్యాయి. నక్కపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సల అనంతరం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు కోసం పోలీసులు గాలిస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండదు

» రాష్ట్ర క్రీడల శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మధురవాడ, జూన్ 30 : క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పీఎం పాలెంలోని ఏసీఏవీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతిభకే పట్టం కడతామన్నారు. క్రీడల్లో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారన్నారు. కొన్నేళ్లుగా క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండడంతో ప్రతిభ గల క్రీడాకారులు అవకాశాలు లేక మరుగునపడిపోతున్నారని చెప్పారు. ఏపీఎల్ వంటి మ్యాచ్‌ల్లో క్రికెటర్లు ప్రతిభ చూపి ఐపీఎల్, అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌లకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రికెట్ మైదానం అభివృద్ధికి అవసరమయితే బీసీసీఐ నుంచి కూడా నిధులు సమీకరిస్తామన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులు ఎందరో ఉన్నారని, వారందరికీ ప్రస్తుతం క్రీడా మైదానాల కొరత ఉందని వాటిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీడీసీఏ అధ్యక్షుడు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ నగరంలో క్రీడా మైదానాల కొరత ఉందని క్రికెటర్లను ప్రోత్సహించాలంటే అందరికీ అందుబాటులో మైదానాలు ఉండాలన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి కలెక్టర్ మయూర అశోక్ మాట్లాడుతూ క్రీడలు యువతలో ఉత్తేజాన్ని పెంపొందిస్తాయన్నారు. మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ ఏపీఎల్ వంటి మ్యాచ్‌లు క్రీడాకారుల ప్రతిభకు పదును పెడతాయన్నారు. ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీఎల్‌ను వేదికగా చేసుకొని ఎందరో క్రికెటర్లు అంతర్జాతీయ స్థాయికి ఎదగడం గర్వకారణమని పేర్కొన్నారు. పీఎల్-3లో 19 మ్యాచ్‌లు జరగనున్నాయని ఇవి ఈనెల 13న ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, గోకరాజు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జూన్ 30 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు రకాల పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్కటి చొప్పున స్వర్ణ సంపెంగలతో పూజలు చేశారు. తరువాత పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్యం కల్యాణం జరిపారు.మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

గిరిజనుల జీవన విధానంపై ఫొటోగ్రఫీ సదస్సు


ఫొటో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన చిత్రం

విశాఖపట్నం, జూన్ 30 : జాతీయ కెమెరా దినోత్సవాన్ని పురస్కరించుకొని వాల్తేరు ఫొటోగ్రాఫిక్ సొసైటీ సభ్యులు ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు లంబసింగి, తాజంగి, కొత్తపల్లి జలపాతాలు, అరుకు వ్యాలీలోని గిరిజన గ్రామాల్లో పర్యటించారు. వారి జీవన విధానంపై ఫొటోలు తీసి వాటిపై ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నేచర్, స్టిల్ లైఫ్, ల్యాండ్ స్కేప్ అంశాలపై ఫొటోగ్రాఫర్లకు అవగాహన కల్పించారు. కొర్లపాటి సరస్వతీరావు మాట్లాడుతూ స్టిల్ లైఫ్, నేచర్ ఫొటోగ్రఫీపై ప్రసంగించారు. సొసైటీ కార్యదర్శి సీనియర్ ఫొటో జర్నలిస్టు ఎంవీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేణుగోపాలరావు, కొండా జాష్వా, వీవీ రామరాజు, రమేష్ చంద్ర బోస్, డీవీ రమణ, పల్లా శ్రీనివాస్, మురుగేష్ అయోధ్య, సాయిరాం, ఎస్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

సేవలు విస్తృతం.. పరిధి పరిమితం

కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి సమస్యల సుస్తీ

» ఏళ్లు గడిచినా కార్యరూపం దాల్చని సీహెచ్‌సీ ప్రతిపాదన
» వేధిస్తున్న సిబ్బంది కొరత
» అరకొరగా మందులు
» కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు


కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం

కృష్ణాదేవిపేట, జూన్ 30: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో ఆరు ఎకరాల్లో గల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని (పీహెచ్‌సీ) కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా మార్చాలన్న ప్రతిపాదన ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాగా ఉన్నప్పుడు ఈ పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాఉన్నతాధికారులు 2019లో ప్రతిపాదించారు. అయితే అదే ఏడాది అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనికి గురించి పట్టించుకోకపోవడం, కరోనా మహమ్మారి వంటి కారణాల వల్ల పీహెచ్‌సీని సీహెచ్‌సీ మారడం జరగలేదు. దీంతో గిరిజన, మైదాన ప్రాంతాల రోగులు అత్యవసర సమయంలో వైద్య కోసం నర్సీపట్నం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటున్నది.


పీహెచ్‌సీలో వైద్య సేవల కోసం వేచి ఉన్న రోగులు

రాష్ట్ర విభజనకు ముందు ఈ పది పడకల పీహెచ్‌సీలో కొయ్యూరు మండల పరిధిలోని సుమారు 40 గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలు పొందేవారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆ గ్రామాలను కొయ్యూరు పీహెచ్‌సీలో విలీనం చేశారు. ప్రస్తుతం ఏఎల్‌పురం, నాగాపురం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, చోద్యం, విప్పలపాలెం ఏడు సచివాలయ పరిధిలో ప్రజలకు ఈ పీహెచ్‌సీనే ఆధారం. గతంలో పాడేరు ఐటీడీఏ పరిధిలో ఈ పీహెచ్‌సీ ఉండేది. కొయ్యూరు పీహెచ్‌సీ 25 కిలోమీటర్లు దూరంలో ఉండటంతో విలీనం చేసిన గిరిజన గ్రామాలకు దగ్గరలో ఉన్న కృష్ణాదేవిపేట పీహెచ్‌సీలో రోగులు, గర్భవతులు ఇక్కడ వైద్య సేవలు పొందడం తప్పలేదు. ఒక్కో పీహెచ్‌సీకి 11 మందే వైద్య సిబ్బంది చాలు అనే ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం ఈ పీహెచ్‌సీలో ఉన్న అదనపు వైద్యసిబ్బందిని బదిలీ చేసింది. దీంతో ఇక్కడ నలుగురు సిబ్బందిని బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ప్రతి రోజు 150 నుంచి 200 మంది రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. అయితే 'సేవలు విస్తృతం.. పరిధి పరిమితం' అనే చందంగా పీహెచ్‌సీ తయారంది. అవసర మేరకు సరిపడే వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవటంతో వైద్యసేవలు పూర్తి స్థాయిలో అందించలేకపోతున్నారు. అంతేకాకుండా రోగులకు సరిపడే స్థాయిలో మందులు ఉండడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో మందులు బయట కొనుకోలు చేయాల్సి వస్తోందిన రోగులు వాపోతున్నారు. ఈ పీహెచ్‌సీని సీహెచ్‌సీ చేసి సేవలు మెరుగు పరిచాలని స్థానికులు కోరుతున్నారు.

ఫార్మా వ్యర్థాలపై భరిణికం గ్రామస్థులు ఆందోళన

» మల్లోడి గెడ్డలో జలాలు పరిశీలన
» ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్


మల్లోడి గెడ్డ కల్వర్టు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

పరవాడ, జూన్ 30: ఫార్మా వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని భరిణికం గ్రామస్థులు డిమాండ్ చేశారు. 'ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం' శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. కొన్ని ఫార్మా కంపెనీల యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘించి వ్యర్థ జలాలను గుట్టుచప్పుడు కాకుండా బయటకు విడిచిపెట్టడంతో అవి గెడ్డల్లో దర్శనమిస్తున్నాయి. పరవాడ నుంచి అనకాపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న స్థానిక మల్లోడి గెడ్డ కల్వర్టు వద్ద ఇరువైపులా ఫార్మా వ్యర్థ జలాలతో గెడ్డ నిండిపోయింది. ఈ కారణంగా అటుగా రాకపోకలు సాగించే వారంతా దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాలను 'ఆంధ్రజ్యోతి'లో ప్రస్తావించడంతో భరిణికం గ్రామస్థులు మేల్కొన్నారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు మల్లోడి గెడ్డ వద్దకు చేరుకుని ఫార్మా వ్యర్థజలాలను పరిశీలించారు. రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇలా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతున్నారని మండిపడ్డారు. తక్షణమే సదరు యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యర్థ జలాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, వ్యవసాయానికి నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మూగజీవాలతో పాటు జల చరాసులు మృత్యువాతపడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొండా తాతారావు, పెదిశెట్టి సత్యారావు, బొండా వెంకట సత్యారావు, జి.అప్పలరాజు, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనాలు సేకరించిన పీసీబీ

ఇదిలావుంటే, మల్లోడి కాలువ కల్వర్టు వద్ద నిల్వ ఉన్న ఫార్మా వ్యర్థ జలాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు ఆదివారం పరిశీలించి, నీటి నమూనాలను సేకరించారు. మూడు రోజుల్లో దీనికి సంబంధించి నివేదికను తెలియజేస్తామని తెలిపారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అధ్వానంగా మాకవరపాలెం బస్టాండ్


బురదమయంగా ఉన్న బస్టాండ్ ఆవరణ

మాకవరపాలెం, జూన్ 30: మండల కేంద్రం మాకవరపాలెంలో బస్టాండ్ గోతులమయంగా మారింది. దీంతో చిన్నపాటి వర్షం వస్తే చాలు గోతుల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. చిన్నపాటి జల్లులు కురిస్తే బస్టాండ్ ఆవరణ అంతా వర్షం నీరు చేరి అధ్వానంగా తయారవుతోంది. ఇక్కడకు వచ్చే ప్రయాణికులు అడుతు తీసి అడుగు పెట్టలేని దుస్థితి ఎదురవుతోంది. అంతా అపరిశుభ్రంగా మారిపోతుండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ కారణంగా వర్షం వస్తే చాలు బస్టాండ్‌కు వెళ్లాలంటే ప్రయాణికులు వెనకడుగు వేస్తున్నారు. దీనికితోడు ఇటీవల బస్టాండ్ ఆవరణలో షాపుల నిర్మాణం చేపట్టడంతో నిర్మాణసామగ్రి కూడా వేశారు. దీంతో ఆవరణ ఇరుకుగా మారి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. వర్షం వస్తే చాలు బస్టాండ్ ప్రాంతం బురదగా మారిపోతోంది. ఆ సమయంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా అడుగు వేసినా జారిపోవడం జరుగుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు పడిపోయి గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం బస్టాండ్ అవరణ నుంచి వర్షం నీరు బయటకు వెళ్లే ఏర్పాటు చేయాలని అంటున్నారు. ఇప్పటికైనా బస్టాండ్ ఆవరణలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టీ-20 వరల్డ్ కప్ విజయంతో సంబరాలు


పాయకరావుపేటలో సంబరాలు జరుపుకుంటున్న క్రికెట్ అభిమానులు

పాయకరావుపేట, జూన్ 30: భారత్ క్రికెట్ జట్టు టీ20 వరల్డ్ కప్ కైవసం చేసుకోవడం పట్ల మండలంలో క్రికెట్ అభిమానులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీలు, బాణసంచా కాల్పులతో సందడిచేశారు. కేక్‌లను కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ క్రికెట్ ప్లేయర్స్ గెడ్డం చలపతి, గొల్లపల్లి నాగు, ధనిశెట్టి బాబి, ఎజ్జల చంద్రశేఖర్, చలపాక నాగేశ్వరరావు, పెదిరెడ్డి పండు తదితరులతో పాటు క్రికెట్ టీం సభ్యులు పాల్గొన్నారు.


నక్కపల్లిలో కూటమి నాయకులు స్వీట్లు పంపిణీ

నక్కపల్లి : టీ-20 వరల్డ్ కప్ చాంపియన్‌గా ఇండియా నిలవడంతో నక్కపల్లిలో పలువురు క్రీడాభిమానులు, కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. చాలా కాలం తరువాత రోహిత్ సేన ఈ ఘనత సాధించడం చాలా సంతోషంగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కోసూరు శ్రీనివాసరావు, వైబోయిన రమణ, దార్ల కృష్ణ, పెదిరెడ్డి రమేశ్, రాంబాబు, దేవవరపు లోవరాజు, సురేంద్ర, అప్పన్న తదితరులు స్వీట్లు పంచిపెట్టారు.

చినుకు పడితే.. నరకమే!

కోటవురట్ల ఎంపీడీవో ఆఫీస్ రోడ్డులో నిలిచిపోతున్న నీరు

మురుగు చేరుతుండడంతో రాకపోకలకు మరిన్ని ఇబ్బందులు


ఇటీవల కురిసిన వర్షాలకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

కోటవురట్ల, జూన్ 30 : చినుకుపడితే.. కోటవురట్ల ఎంపీడీవో కార్యాలయం రోడ్డుపై ప్రయాణం నరకమే. ఇక్కడ ఇరువైపులా ఆక్రమణలు చోటుచేసుకోవడంతో పాటు కాలువలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా వర్షాకాలం వస్తే రాకపోకలకు జనం ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటాయి. వర్షపు నీరుకు తోడు మురుగు రోడ్డుపై ప్రవహిస్తుంటుంది. ఆ సమయంలో పాఠశాలలకు వెళ్లే చిన్నారుల ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయి. మోకాళ్ల లోతున నీరు ఉంటుండడంతో ద్విచక్ర వాహనాల ఇంజన్, సైలెన్సర్లలోకి నీరు చేరుతుండడంతో అవి ముందుకు కదలని పరిస్థితి ఏర్పడుతోంది. ఇక పాదచారుల అవస్థలు చెప్పనక్కర్లేదు. దీర్ఘకాలంగా ఇక్కడ ఈ సమస్య ఉన్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించరూ..

» అధికారులకు నీళ్లబంధ గ్రామస్థుల వినతి


నీళ్లబంధ గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్న గిరిజనులు

రోలుగుంట, జూన్ 30: తమ గ్రామానికి కనీస వసతులు కల్పించాలంటూ పీవీటీజీ ఆదిమ తెగ గిరిజనులు వేడుకుంటున్నారు. మండలంలోని అర్ల పంచాయతీ శివారు పిత్రిగెడ్డ శివారు నీళ్లబంధ గ్రామస్థులు ఆదివారం వినూత్న రీతిలో నిరసనకు దిగారు. తమకు మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలంటూ అధికారులకు దండం పెడుతూ ఆందోళన చేపట్టారు. ఈ గ్రామంలో ఆరు కుటుంబాలు ఉంటున్నాయి. వర్షాకాలంలో వీరికి చెలమల్లోని నీరే గతి. మంచినీటి సౌకర్యం కల్పించాలంటూ గ్రామస్థులు ఎన్నాళ్ల నుంచో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో ఇక్కడ పిడుగుపడి అందుబాటులో ఉన్న సోలార్ బ్యాటరీ కూడా పేలిపోయింది. దీంతో రాత్రివేళల్లో చీకట్లో మగ్గిపోతున్నా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు ముందుకు రావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కనీసం రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అత్యవసర వైద్యం అందాలంటే డోలి మోతతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తమకు కనీస వసతులు కల్పించాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

బ్యాలెట్ ద్వారా మత్స్యకార సొసైటీల ఎన్నికలు

» ఏపీ మత్స్యకార జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి


మత్స్య శాఖాధికారులకు రాసిన లేఖ చూపుతున్న ప్రతినిధులు

నక్కపల్లి, జూన్ 30 : రాష్ట్రంలో మత్స్యకార సహకార సొసైటీల ఎన్నికలు నిర్వహించేటప్పుడు బ్యాలెట్ పద్ధతిని అవలంబించాలని ఏపీ మత్స్యకార జేఏసీ అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్య, కార్యదర్శి పిక్కి కోదండరాం కోరారు. ఈ మేరకు వారు మత్స్య శాఖాధికారులకు ఆదివారం లేఖ రాశారు. అనంతరం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పూర్వం నుంచి మత్స్యకార సొసైటీలు, చెరువులు, రిజర్వాయర్ల వంటి సొసైటీలకు చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు జరుపుతున్నారన్నారు. ఈ విధానం వల్ల ఎవరు ఎవరికి ఓటేశారో తెలిసిపోతుందని, ఫలితంగా ఆయా గ్రామాల్లో ఘర్షణలు జరుగుతుండడంతో పాటు పోలీస్ కేసుల వరకూ పరిస్థితులు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకార సొసైటీల్లో కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఓటర్లుగా చేర్చాలని కోరారు. ప్రభుత్వం బ్యాలెట్ పద్ధతిలో మత్స్యకార సొసైటీల ఎన్నికలు జరపా లని విజ్ఞప్తి చేశారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, జూన్ 30: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలలో మిగులు సీట్లభర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 25న సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఐడీ స్లిప్ ప్రింట్, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని దగ్గరలో ఉన్న ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికేట్లు పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాల కోసం ఈనెల 27న నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాల కోసం ఈ నెల 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్‌కి హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం 87907 41378, 89772 72231, 70137 37243లో సంప్రదించాలని తెలిపారు.

ఏయూ మాజీ వీసీ వేధింపులపై నేడు విచారణ

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై వర్సిటీ న్యాయ విద్యార్థిని సత్యాల అంజనాప్రియ జాతీయ ఎస్సీ కమిషన్‌కు చేసిన ఫిర్యాదుపై సోమవారం విచారణ జరగనుంది. విశాఖ తూర్పు ఏసీపీ పోలీస్ కార్యాలయంలో విచారణకు రావాలని పోలీసులు న్యాయ విద్యార్థినికి సమాచారం పంపారు. వర్సిటీలో హాస్టల్ ఫీజులపై న్యాయ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న అంజనాప్రియ సమాచార హక్కు చట్టం కింద గత ఏడాది దరఖాస్తు చేశారు. ఈ మేరకు సమాచారం ఇవ్వకుండా మహిళా హాస్టల్ వార్డెన్ పల్లవి నుంచి అంజనాప్రియకు బెదిరింపులు రావడంతో సదరు విద్యార్థిని జాతీయ ఎస్సీ కమిషన్‌కు గత ఏడాది డిసెంబరు 12న ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన ఎస్సీ కమిషన్ నగర పోలీస్ కమిషనర్, ఏయూ వీసీకి నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు హాస్టల్ వార్డెన్‌ను విచారించారు.ఈలోగా అంజనాప్రియ ఈనెల13న మరోసారి జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదుచేయడంతో తాజాగా నోటీసులు జారీచేశారు. దీంతో సోమవారం విశాఖ తూర్పు సబ్‌డివిజన్ పోలీసులు విచారణ చేపట్టనున్నారు.

ముగిసిన జిల్లా స్థాయి చదరంగం పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 30: ఆల్ విశాఖ చెస్ సంఘం నిర్వహించిన జిల్లా అండర్- 19 ఓపెన్, మహిళల చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ టోర్నీ ఓపెన్ కేటగిరిలో లంక మార్తాండ కుమార్, వైభవ్ గ్రంధి, తనీష్ చొప్ప, లక్ష్మణ్ ఉద్ధవ్..మహిళల విభాగంలో నిధి కేశవరావు, మధుపడ మనస్వీ, అఫ్సీన్ అహ్మద్, దత్తి ధార్మిక విజేతలుగా నిలిచారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో జరిగిన ఈ టోర్నీ ముగింపు కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ధ్రువ పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం ప్రతినిధులు బాబూరావు, ఎస్. మణికంఠరావు, ఉమామహేశ్వరరావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభం కూలిందా.. ప్రాణాలు గోవిందా..

» పరవాడ ప్రధాన రహదారి గండివారి వీధిలో పొంచి ఉన్న ప్రమాదం


గండివారి వీధి మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న స్తంభం

పరవాడ, జూన్ 30 : మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారిలోని గండివారి వీధి మలుపు వద్ద గల విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సుమారు పదేళ్ల క్రితం మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ నుంచి పరవాడ సంతబయలు మీదుగా సినిమాహాల్ జంక్షన్ వరకు రహ దారికి ఇరువైపులా స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో కొన్ని దెబ్బతిని కూలిపోయాయి. ఇదే దుస్థితికి ఈ స్తంభం కూడా చేరుకుంది. అడుగు భాగం పూర్తిగా తుప్పుపట్టి అత్యంత ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు కూలిపోతుందో అనే ఆందోళన అందరిలో నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో జరగరానిది జరగక ముందే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా ఆ ప్రాంత ప్రజలంతా కోరుతున్నారు.

అనుమతి లేని కల్వర్టు నిర్మాణం నిలిపివేయాలి

నీటి పారుదల శాఖ ఏఈ శ్రీరామ్మూర్తి


ఆవ కాలువపై అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కల్వర్టు

పాయకరావుపేట రూరల్, జూన్ 30 : మంగవరం రెవెన్యూ పరిధిలోని ఆవ కాలువపై అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కల్వర్టు పనులను నిలిపి వేయాలని నీటి పారుదల శాఖ ఏఈ శ్రీరామ్మూర్తి ఆదేశించారు. మంగవరం గ్రామానికి చెందిన రైతు తన పొలంలోకి వెళ్లేందుకు ఆవ కాలువపై కల్వర్టు నిర్మాణం చేపడుతున్నారు. తాండవ నది నుంచి ఆవ కాలువ ద్వారా కాలువలోకి నీరు చేరి అక్కడ నుంచి కింద ఆయకట్టు భూములకు చేరుతుంది. సాగునీటి కాలువపై కల్వర్టు నిర్మించాలంటే నీటిపారుదల శాఖాధికారుల అనుమతుల తప్పనిసరి. కానీ ఎటువంటి అనుమతులు లేకుండా కల్వర్టు నిర్మిస్తుండడంతో నీటి పారుదల శాఖ ఏఈ సదరు నిర్మాణ పనులను సందర్శించి పరిశీలించి నిలిపివేయాలని నోటీసులు జారీ చేశారు.

విద్యాశాఖలో వింత పోకడ

... 3వ పేజీ తరువాయి

ఆడిట్ చేయించుకోవాల్సి ఉంటుంది. రెండు కేంద్రాల్లో 704 పాఠశాలల రికార్డులను ఆడిట్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ మండల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. జూలై 1న నర్సీపట్నం, గొలుగొండ, కోటవురట్ల, మాకవరపాలెం, నక్కపల్లి, నాతవరం, పాయకరావుపేట, రావికమతం, రోలుగుంట, ఎస్.రాయవరం, మాడుగుల, ఎలమంచిలి మండలాల రికార్డులను పరిశీలిస్తారు. జూలై 2న కశింకోట, అనకాపల్లి, అచ్యుతాపురం, బుచ్చెయ్యపేట, చీడికాడ, చోడవరం, దేవరాపల్లి, కె.కోటపాడు, మునగపాక, పరవాడ, రాంబిల్లి, సబ్బవరం మండలాల పాఠశాలల రికార్డులను పరిశీలించనున్నారు.

సంక్షేమానికి పూర్వ వైభవం!

... 3వ పేజీ తరువాయి

వచ్చింది. చంద్రబాబు అధికారంలోకి రావడంతో మళ్లీ బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలు పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తాయని అంతా భావిస్తున్నారు.

ఇవీ హామీలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు అనేక సామాజిక వర్గాల వారికి ఆర్థికంగా సాయం అందిస్తామని ప్రకటించారు. గతంలో మాదిరిగా సబ్సిడీ రుణాలతో పాటు స్వయం ఉపాధికి వీలుగా వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు సహకరిస్తామన్నారు. సబ్సిడీపై కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు అందిస్తామన్నారు. చేతివృత్తులను ప్రోత్సహించేందుకు నాణ్యమైన పరికరాలను అందజేయడంతో పాటు కుల సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంఘాలకు కూడా సబ్సిడీ రుణాలిచ్చి ఉత్పాదక పరిశ్రమలు ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. వీటిపై ఆయా వర్గాలు ఆశలు పెంచుకుంటున్నాయి.

'పేట'.. మురుగే ప్రతిచోటా..

కాలువలు లేకున్నా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం

» ఇళ్ల మధ్య తిష్టవేస్తున్న వాడుక నీరు
» దోమలు, పందుల బెడదతో జనం తీవ్ర ఇబ్బందులు
» పట్టించుకోని పంచాయతీ పాలకులు


రాజుగారిబీడులో రోడ్లపై నిలిచిన మురుగు


అంబేద్కర్ కాలనీలోని కాలువలో...


ఇళ్లమధ్య ఖాళీ స్థలంలో...

పాయకరావుపేట, జూన్ 30: పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలువల్లేని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాల పరిసరాల్లో మురుగు తిష్ట వేస్తోంది. ఫలితంగా ఆయా ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేజర్ పంచాయతీ అయిన పాయకరావు పేటలో ఇప్పటి వరకు సుమారు 200 ఎకరాల్లో వేసిన లేఅవుట్లలో చాలాచోట్ల వీఎంఆర్డీఏ (వుడా) నిబంధనలను పాటించకపోవడంతో రోడ్లు, డ్రెయిన్లు తదితర కనీస సౌకర్యాలు కరువయ్యాయి. బృందావనం, గారావారిబీడు, ప్రశాంతినగర్, షీలానగర్, సాయినగర్, రాజుగారి బీడులలోని పలు వీధుల్లో కాలువల్లేక ఇళ్ల ముందు మురుగు రోజుల తరబడి నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద తీవ్రంగా ఉంటోంది. అదేవిధంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో కాలువలు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాల నుంచి వచ్చే మురుగు బయటకు పోయే మార్గం లేక ఇళ్ల మధ్య, ఖాళీ స్థలాల్లో నిలిచిపోయి దోమలు, పందుల ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. కాలువలు ఉన్న చోట్ల కూడా రోజుల తరబడి శుభ్రం చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్లపై మురుగు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు జనం అవస్థలు పడుతున్నారు. ఇక రైల్వే పట్టాల అవతల ఉన్న లింగాలతోట కాలనీలోని తొంభై శాతం పైగా కాలువలు ఉన్నా సరైన అవుట్‌లెట్లు లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి దర్శనమిస్తోంది. అసలే వర్షా కాలం కావడంతో మురుగు కారణంగా అందరిలో అంటువ్యాధుల భయం వెంటాడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాయకరావు పేటలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి, పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపాల్సిందిగా అంతా కోరుతున్నారు.

అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

» శతశాతం పంపిణీ పూర్తయ్యేలా కృషి చేయాలి
» అధికారులు, కూటమి శ్రేణులకు ఎమ్మెల్యేలు కొణతాల, సుందరపు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో పీలా

కొత్తూరు, జూన్ 30 : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు శతశాతం లబ్ధిదారులకు పంపిణీ అయ్యేలా చూడాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం రింగురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో అధికారులు, కూటమి శ్రేణులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సోమవారం నుంచి పెన్షన్ల పంపిణీ ప్రారంభం కానుందన్నారు. అంతకు ముందు జోనల్ కమిషనర్‌తో పెన్షన్లు పంపిణీపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పండగలా పెన్షన్ల పంపిణీ : ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం : పెన్షన్లు అర్హులందరికీ అందేలా అధికారులతో పాటు కూటమి శ్రేణులు కూడా చూడాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచించారు. ఆదివారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో కూటమి ప్రధాన నాయకులతో పాటు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు పెన్షన్ల పంపిణీని పండగలా చేపట్టాలన్నారు.

పాయకరావుపేట : సామాజిక పెన్షన్ల పంపిణీలో కూటమి నాయకులు పాల్గొనాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతూ అర్హులందరికీ పెన్షన్లు అందేలా చూడాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, ఎస్.పద్మావతితోపాటు టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, బత్తిన అచ్చిరాజు, జూరెడ్డి ప్రసాద్, లెక్కల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'ఏఎంఏఎల్ కళాశాలకు గుర్తింపు తెస్తాం'


సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

కొత్తూరు, జూన్ 30 : అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలకు అన్నివిధాలా గుర్తింపు తీసుకు వచ్చేలా తమవంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థుల సంఘం పేర్కొంది. జార్జి క్లబ్ ఆవరణలో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు మాట్లాడుతూ కళాశాలను జూలై 18వ తేదీన జాతీయ స్థాయి నాక్ అక్రిడిటేషన్ బృందం పరిశీలించనున్న నేపథ్యంలో కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పూర్వ విద్యార్థుల్లో అన్ని రంగాల్లో నిష్ణాతులను ఆహ్వానించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, పర్యవేక్షకురాలు పెంటకోట అనురాధ, వ్యాయామ సంచాలకుడు డాక్టర్ నాయుడు, కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి వై.జగదీశ్వరరావు, జార్జిక్లబ్ కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, విశ్రాంత ప్రిన్సిపాళ్లు దుద్దు శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.నూకరాజు, వ్యాపారవేత్త మళ్ల లక్ష్మీప్రసాద్, అబ్దుల్ కలాం సేవా సంస్థ చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్, ఉపాధ్యాయ సంఘ నాయకుడు కొణతాల రామచంద్రరావు, రిటైర్డు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటవురట్ల, జూన్ 30 : మండల కేంద్రం కోటవురట్ల విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక నిర్వహణ పనుల్లో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ ఈఈ వీడీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది నుంచి పన్నెండు గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని వివరించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

10 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

కశింకోట, జూన్ 30 : అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్టు పోలీసు స్టేషన్ రైటర్ సూర్యారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆదివారం కశింకోట రైల్వే గేటు వద్ద సిబ్బందితో కలిసి మాటు వేశామన్నారు. అనకాపల్లి మండలానికి చెందిన సిగిరెడ్డి వెంకటేశ్వరరావు గోనె సంచిలో పది క్వార్టర్ మద్యం సీసాలను తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నట్టు చెప్పారు. అనంతరం అతనిని అరెస్టు చేశామని, కోర్టుకు తరలించనున్నామని చెప్పారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి వీధి పండగ


పూజలందుకున్న అమ్మ

అనకాపల్లి టౌన్, జూన్ 30 : పట్టణంలోని వన్ వే ట్రాఫిక్ డౌన్‌లో గల నెయ్యిలవీధివాసులు ఆదివారం నూకాంబిక వీధి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. 108ఘటాలను పుర వీధుల గుండా ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కొత్తపాలెంలో పశలమారి సత్తెమ్మతల్లి జాతర


బాజాభజంత్రీలతో ఆలయానికి వెళుతున్న గ్రామస్థులు

ఎలమంచిలి, జూన్ 30 : మునిసిపాలిటీ పరిధిలోని కొత్తపాలెంలో ఆదివారం పశలమారి సత్తెమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢ మాసం అమావాస్య ముందు ఆదివారం ఈ వేడుక జరుపుకుంటుండడం ఇక్కడ ఆనవాయితీ. ఈ సందర్భంగా తెల్లవారు నుంచి గ్రాస్థులంతా ఉపవాసాలను చేసి అమ్మవారిని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుసుకున్నారు. గ్రామ పెద్దలు ఆడారి భాస్కరావు, ఆడారి రెడ్డి నాయుడు, కౌన్సిలర్ రాపేటి సంతోష్, సూరిబాబు, శంకర్, పిల్లా నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం

పరవాడ, జూన్ 30 : ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం పంచాయతీల పరిధి హనుమాన్‌నగర్‌లో కొలువు దీరిన అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు జరిపారు. నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

పాయకరావుపేట, జూన్ 30 : ఇక్కడి ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న వివిధ ట్రేడుల్లో ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి పాసై ఆసక్తిగల విద్యార్థులు జూలై 24వ తేదీలోగా అన్ని ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడంతో పాటు కళాశాలలో వాటిని వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. 27వ తేదీన కౌన్సిలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'కాంగ్రెస్ పార్టీ బలోపేతమే అందరి లక్ష్యం కావాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఐఆర్ గంగాధర్

అనకాపల్లి టౌన్, జూన్ 30 : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కాంగ్రెస్ పూర్తి స్థాయిలో బలోపేతమే అందరి లక్ష్యం కావాలని ఆపార్టీ నాయకుడు ఐఆర్ గంగాధర్ పిలుపు నిచ్చారు. ఆదివారం ఇక్కడ ముఖ్య నేతలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సంస్థాగతంగాపార్టీని బలోపేతం చేసేందుకు అన్ని కమిటీలను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు దాసరి సంతోష్, ఎస్. గజాలు, ఎగ్గాడ భాస్కరరావు, వి.రామ్‌ప్రసాద్, ఏడువాకల దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో గొప్పది : చలపతిరావు


రక్తదాన శిబిరంలో భాగంగా మొక్కలు పంపిణీ చేస్తున్న చలపతిరావు, ప్రగడ

ఎలమంచిలి, జూన్ 30 : సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ, బుజ్జి విజిట బుల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం గొప్పదిగా పేర్కొన్నారు. అనంతరం మొక్కలను పంపిణీ చేశారు. ఎంపీపీ బోదెపు గోవింద్, ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా, సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ గొలుసుపూడి శ్రీనివాస బుజ్జి, టీడీపీ, జనసేన నాయకులు కొఠారు సాంబ, గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, గుర్రాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపుల్లో ప్రయాణం భయం..భయం..


అమృతపురం- దువ్వాడ రోడ్డులో పలుచోట్ల ఉన్న ప్రమాదక మలుపులు



సబ్బవరం, జూన్ 30 : మండలంలోని అమృతపురం నుంచి గొల్లలపాలెం మీదుగా దువ్వాడ వెళ్లే రహదారిలో పలుచోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. అమృతపురం దాటిన తరువాత కొండ మలుపు, అమరిపిని వానిపాలెం వద్ద, గొల్లలపాలెం సమీపంలో ఉన్న మలుపుల వద్ద ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో తరచూ చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో ఇటుగా ప్రయాణం మరింత ఇబ్బందికరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మలుపుల వద్ద ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

'మార్గదర్శకులు హెలెన్ కెల్లర్'


హెలెన్ కెల్లర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూన్ 30 : హెలెన్ కెల్లర్ జయంతిని ఆదివారం ఇక్కడ విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కెల్లర్ చిత్ర పటానికి అసోసియేషన్ అధ్యక్షుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్న వయస్సులోనే భయంకర వ్యాధి కారణంగా వినికిడిని, దృష్టిని కోల్పోయి మాట్లాడలేని స్థితి నుంచి ప్రపంచానికి మార్గదర్శకంగా హెలెన్ కెల్లర్ నిలిచారని కొనియాడారు. అంతరం అంధులు, బధిరులు, దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. హోమ్ ఫ్రమ్ పీపుల్స్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి పోలమరశెట్టి పురుషోత్తం, భాస్కర్ పట్నాయక్, బమ్మిడి రమణ, అర్జునరావు, పోతురాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై విద్యార్థులకు శిక్షణ



నక్కపల్లి, జూన్ 30 : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన పలువురు బాలబాలికలు ఆదివారం ఉదయం ఇక్కడ ఆదిత్య హృదయం పఠనం, సూర్య నమస్కారాలపై శిక్షణ పొందారు. వేంపాడు ఆయుర్వేద డిస్పెన్సరీ యోగా ట్రైనర్ రాంబాబు మంత్ర సహిత, మంత్ర రహిత సూర్య నమస్కార ఆసనాలపై వారికి శిక్షణ ఇచ్చారు. అనంతరం పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని సూచించారు.

ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు


కొత్తపేటలో పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

ఎలమంచిలి, జూన్ 30 : చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతున్న పట్టణంలోని పలు వీధుల్లో పారిశుధ్య పనులు మూడు రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల 'చినుకుపడితే అవస్థలే' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మునిసిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు వెనువెంటనే స్పందించారు. దీంతో కొత్తపేట, మిలట్రీ కాలనీ, ఎల్ఐసీ కార్యాలయం ప్రధాన రోడ్డు పరిసర ప్రాంతాల్లోని కాలువల్లో పూడిక తీయించడంతో పాటు రోడ్లపై ఉన్న వర్థాలను తొలగిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాలుష్యమయంగా పంట కాలువలు

- ఖాళీ సీసాలు, పాలిథిన్ కవర్లు పడేస్తున్న మందుబాబులు
- బహిరంగ మద్యపానంపై నియంత్రణ కరువు


కాశీపురానికి వెళ్లే పంట కాలువలో తేలియాడుతున్న మద్యం సీసాలు

దేవరాపల్లి, జూన్ 30 : మద్యం బాబులు విచ్చలవిడిగా మద్యం తాగడమే కాకుండా బాటిళ్లను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. వీరు మద్యం తాగిన తర్వాత బాటిళ్లను పంట కాలువల్లో పడేస్తున్నారు. దీంతో కాలువల్లో మద్యం సీసాలు పేరుకుపోయి సమస్యగా మారుతోంది.

స్థానిక రైవాడ ఎడమ కాలువ ద్వారా జీవీఎంసీ నీరు సరఫరా చేసే (0 పాయింట్) వద్ద కాలువకు ఆనుకొని కాశీపురం చిననందిపల్లి, పెద నందిపల్లి తదతర గ్రామాలకు సాగు నీరు అందించే కాలువలో మందుబాబులు తాగిన బీరు సీసాలు, డిస్పోజిబుల్, గ్లాసులు, వాటర్ ప్యాకెట్లతో పంట కాలువ పూర్తిగా నిండిపోయింది. మధ్యాహ్నం, సాయంత్రం మందు బాబులు ఆ గట్టులపైనే కూర్చొని తాగి ఖాళీ చేసిన బాటిళ్లను కాలువలో పడేస్తున్నారు. ఈ విధంగా రోజుకు పదుల సంఖ్యలో మద్యం సీసాలు పంట కాలువలో పేరుకుపోతున్నాయి. అంతేకాకుండా రోడ్డును ఆనుకొని ఉన్న కల్వర్టుల గోడలపై, శారదానది బ్రిడ్జిలపై , పంట పొలాల మధ్యలో మద్యం సేవించి సీసాలు, పాలిథిన్‌కవర్లు వేస్తుండడంతో కాలుష్యం పేరుకుపోతోంది. బహిరంగంగా మద్యం తాగడంపై నియంత్రణ లేకపోవడంతో ఈ సమస్య ఎదురవుతోందని రైతులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు, అధికారులు స్పందించి మందు బాబుల కారణంగా పంట కాలువలు, పొలాలు కాలుష్యమయం కాకుండా చూడాలని కోరుతున్నారు.

ముమ్మరంగా వరినారు పోతలు


పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు

రావికమతం, జూన్ 30 : మండలంలోని రావికమతం, కొత్తకోట, దొండపూడి, గర్నికం, కొమిర, మత్స్యపురం, చినపాచిల, మట్టవానిపాలెం, గుడ్డిప తదితర గ్రామాల్లో రైతులు వరినారు పోతలు (వరి విత్తనాలు)వేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో ఈ ఏడాది 20.25 హెక్టార్లలో రైతులు ఖరీఫ్ వరిసాగుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది వర్షాలు ముందుగానే పడి వాతావరణం అనుకూలించడంతో ఆయకట్టు, మెట్టు భూముల్లో వరిసాగుకు సమాయత్తం అవుతున్నారు. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు పోసే పనులను ముమ్మరంగా చేపట్టారు. వరి విత్తనాలను నారు మళ్లు దున్ని వేయాల్సి ఉంటుంది.

అయితే ఇటీవల వర్షాలు విరివిగా పడడంతో నారు మళ్లలో తేమ ఎక్కువగా ఉంది. నారు పోతలకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో, ఆకు మళ్ళలో వరి విత్తనాలు చల్లి రైతులు దువ్వుతున్నారు. ఈ ఏడాది వరి విత్తనాలు కూడా రైతులకు ప్రభుత్వం ముందుగానే సరఫరా చేయడంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఎస్సీ హాస్టల్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి


వినతిపత్రం అందజేస్తున్న సురేశ్

రోలుగుంట, జూన్ 30 : మండలం కేంద్రంలోని స్థానిక హైస్కూల్‌కు ఆనుకుని ఉన్న ఎస్టీ హాస్టల్ భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, దీనికి తక్షణమే వినియోగంలోకి తీసుకోవాలని కోరుతూ ఐటీడీపీ మండల కన్వీనర్ బనికెల సురేష్‌కుమార్ శుక్రవారం ఈవోఆర్డీవో నూకరాజుకు వినతిపత్రం సమర్పించారు. గత పదేళ్ల నుంచి ఈ ఎస్సీ హాస్టల్ నిరుపయోగంగా ఉంది. దీంతో ఈ భవనం ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఇక్కడ కొందరు పోకిరీలు చేరి మద్యం, గంజాయి తాగడం, రాత్రయితే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం పరిపాటిగా మారింది. దీంతో పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు, గ్రంథాలయం సిబ్బంది, పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ భవనాన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించాలని సురేష్‌కుమార్ కోరారు.

'ఆనందసూర్యకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'


మాట్లాడుతున్న నరసింహమూర్తి

చోడవరం, జూన్ 30 : రాష్ట్రంలో బ్రాహ్మణులను సంఘటితపరచి, కూటమి విజయంలో విశేష కృషి చేసినఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూర్యకు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని ఉమ్మడి జిల్లా ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కో-ఆర్డినేటర్ కొమ్మనమంచి నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాహ్మణ, పురోహిత సంఘాలన్నీ ఆనందసూర్య సారథ్యంలో సంఘటితమై తాజా ఎన్నికల్లో చంద్రబాబుకు మద్దతుగా నిలిచారన్నారు. జిల్లా తరఫున ఆనందసూర్యకు ఎమ్మెల్సీ పదవిని సీఎం చంద్రబాబు కేటాయించాలని, ఈ నిర్ణయం టీడీపీ పురోగతికి మరింత మేలు చేస్తుందని నరసింహమూర్తి పేర్కొన్నారు.

'మన్ కీ బాత్' వీక్షించిన కూటమి నేతలు


'మన్ కీ బాత్' వీక్షిస్తున్న కూటమి నేతలు

బుచ్చెయ్యపేట, జూన్ 30 : ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం టీవీల్లో వడ్డాదిలో బీజేపీ, జనసేన పార్టీ నాయకులు వీక్షించారు. వికసిత్ భారత కోసం కోసం కృషి చేస్తున్నారని, దేశంలో మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం ఉంచడంపై పీఎం మోదీ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామరాజు, దూది రాజేష్, శిరిగిరిశెట్టి చిన వెంకయ్యదొర, దాడి సూర్యనాగేశ్వరరావు, దొండా సాయి పాల్గొన్నారు.

బ్లాక్‌బెల్ట్ అర్హత పరీక్షలో క్రీడాకారులు ప్రతిభ


బ్లాక్‌బెల్ట్ అర్హత పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు

చోడవరం, జూన్ 30 : ఈ నెల 29 శనివారం విశాఖలో తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ అర్హత పోటీల్లో మండలానికి చెందిన క్రీడాకారులు అర్హత సాధించారు. ఈ అర్హత పోటీల్లో ఎం.హేమశ్రీ, వి.జెస్సీకరోజ్, వి.ఇశిత, శారద, డి.జాన్‌మార్క్‌లు సత్తా చాటి అర్హత సాధించారు. బ్లాక్‌ బెల్ట్ పరీక్షలో విజయం సాధించిన క్రీడాకారులను తైక్వాండో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ అభినందించారు.

రాయపురాజుపేట పాలసంఘం అధ్యక్షుడిగా రాజుబాబు


రాజుబాబుతో పాలకవర్గ సభ్యులు

చోడవరం, జూన్ 30 : మండలంలోని రాయపురాజుపేట విశాఖ డెయిరీ పాలసంఘం అధ్యక్షుడిగా టీడీపీకి చెందిన బొడ్డేడ రాజుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో రాజుబాబును సభ్యులు సంపూర్ణంగా మద్దతుపలకడంతో రాజుబాబు అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు డెయిరీ అధికారులు ప్రకటించారు. 20 ఏళ్ల తరువాత పాలసంఘం అధ్యక్షునిగా టీడీపీకి చెందిన రాజుబాబు, పాలసంఘం అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో, స్థానిక సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు గంగాధర్, స్థానిక నాయకులు అభినందించారు.

ఘనంగా మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు



మాడుగుల, జూన్ 30 : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం శ్రీమాడుగుల మోదకొండమ్మ అమ్మ వారి ఆల యంలో ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. కాగా భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. అలాగే స్థానిక న్యాయవాది శ్రీనాథ శ్రీనివాసరావు, ప్రమోద్ ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచిత అన్న సంతర్పణ నిర్వహించారు.

ఆరు నెలలుగా ఎంపీడీవో కార్యాలయంలోనే చెత్త బుట్టలు


పంచాయతీలకు అందజేయకుండా మూలన పడేసిన డస్ట్‌బిన్లు

మాకవరపాలెం, జూన్ 30 : సచివాలయాల్లో ఉండాల్సిన చెత్తబుట్టలు గత ఆరు నెలలుగా మండల పరిషత్ కార్యాలయానికే పరిమితయ్యాయి. మండలానికి ఆరు నెలల కిందట సుమారు 2,400 చెత్త బుట్టలు మంజూరయ్యాయి. వీటిని పంచాయతీలకు అందించాల్సి ఉంది. ఈ చెత్త బుట్టలు ద్వారా తడి, పొడి చెత్తను బుట్టల్లో వేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించే ఉద్దేశంతో వీటిని కొనుగోలు చేశారు. అయితే ఆరు నెలలు గడుస్తున్నా చెత్త బుట్టలు పంచాయతీలకు అందజేయలేదు. దీంతో గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేయడం కష్టంగా మారిందని పారిశుధ్య కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త బుట్టలను పంపిణీ చేయాలని పంచాయతీ సిబ్బంది కోరుతున్నారు.

మాడుగులలో తేలికపాటి జల్లులు

మాడుగుల, జూన్ 30 : మాడుగుల మండలంలో ఆదివారం తేలికపాటి వర్షపు జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్మడంతో వాతావరణం చల్లగా మారింది. మండలంలో కొన్నిచోట్ల చిరు జల్లులు పడ్డాయి. వాతావరణం ఒక్కసారిగ చల్లబడింది. ఇకపై అడపాదడపా వర్షాలు కురిస్తే వ్యవసాయానికి అనుగుణంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం వరినారు కోసం విత్తనాలు వేసే పనిలో నిమగ్నమై ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనండి

- కూటమి పార్టీల శ్రేణులకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూన్ 30 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలను కొత్తపుంతలు తొక్కిస్తున్న సీఎం చంద్రబాబు పిలుపు మేరకు సోమవారం చేపట్టనున్న పింఛన్ల పంపిణీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూటమిపార్టీల శ్రేణులకు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల పంపిణీని బాధ్యతగా తీసుకుని లబ్దిదారులకు వాటిని అందించేలా చూడాలని కోరారు. అలాగే స్థానిక సమస్యల పరిష్కారం కోసం త్వరలో తాను ఇంటింటికీ తిరుగుతానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, జనసేన నాయకులు సిరిపురపు రమేష్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, మండల పట్టణ పార్టీ అధ్యక్షులు బొడ్డేడ గంగాధర్, దేవరపల్లి వెంకట అప్పారావు, లీగల్‌సెల్ రాష్ట్ర నాయకులు గూనూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో 12 మందికి పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులు

చోడవరం, జూన్ 30 : ఈ నెల 27 నుంచి 28 వరకూ గాజువాకలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన 12 మంది క్రీడాకారులు స్వర్ణ, రజత పతకాలు సాధించినట్టు తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ తెలిపారు. ఈ పోటీల్లో 9 మందికి బంగారు పతకాలు, ముగ్గురికి రజత పతకాలు లభించాయని, వీరంతా త్వరలో శ్రీకాకుళం జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను తైక్వాండో ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు టి.హర్షవర్ధన్‌ప్రసాద్, జిల్లా కార్యదర్శి చవల చంద్రశేఖర్, తదితరులు అభినందించారు.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టరూ!

- ప్రమాదకర మలుపులతో వాహనదారుల ఇబ్బందులు


రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు

మాడుగుల రూరల్, జూన్ 30 : మండలంలోని కేజేపురం వయా దబ్బగుంట మీదుగా మాడుగుల వెళ్లే రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈ మార్గంలో ప్రమాదకర మలుపులు ఉండడంతో ఆ వైపుగా రాకపోకలు సాగించే వారు భీతిల్లుతున్నారు. కేజేపురంతో పాటు వంటర్లపాలెం గ్రామస్థులు మాడుగులకు వెళ్లాలంటే ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. సుమారు మూడు కిలోమీటర్లు దూరం ప్రమాదకర మలుపులు మార్గంలో ప్రయాణించాలి. ఈ దారిలో బస్సు సర్వీసులు లేనందున ద్విచక్ర వాహనాలు, ఆటోలపైనే ఆధారపడి ప్రయాణిస్తుంటారు. ఈ మార్గంలో రైతుల పంట కళ్లాలు ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రైతులు రాకపోకలు సాగిస్తుంటారు.

రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకుని వెళ్లేందుకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

ఇటీవల వర్షాలు పడటంతో పిచ్చి మొక్కలు మరింతగా పెరిగిపోయి రోడ్డు అంచులు, మలుపులను కప్పేస్తున్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు జంగిల్ క్లియరెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనచోదకులు, రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరుతున్నారు.

మానవతావాది అమృతకుమార్

- రిటైర్డ్ ఎంఈవోకు ఘన సన్మానం


అమృతకుమార్ దంపతులకు ఊరేగిస్తున్న దృశ్యం

నాతవరం, జూన్ 30 : ఉద్యోగ విరమణ చేసిన ఎంఈవో టి.అమృతకుమార్, రత్నకుమారి దంపతులను ఆదివారం సాయంకాలం విద్యార్థులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. సుమారు కిలోమీటర్లు మేర పూలవర్షం, మేళతాళాలతో ఊరేగింపు చేపట్టారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో శాలువాలు కప్పి సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎంఈవో అమృతకుమార్ గొప్ప మానవతావాది అని వక్తలు కొనియాడారు. కరోనా సమయంలో ప్రైవేట్ పాఠశాల్లో పనిచేసే ఉపాధ్యాయులు జీతాలు లేక అల్లాడుతుంటే వారికి ఆర్థికసాయం చేశారని గుర్తు చేశారు. పేద విద్యార్థులకు సహాయం చేస్తూ వచ్చేవారన్నారు. అంతకుముందు ఎంఈవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.రాంబాబు ఎస్ఐ ఎం.రామారావు ఏవో పార్థసారథి, పాడేరు డీఎల్పీవో, ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు, నాలుగు మండలాల ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్‌కు సన్మానం

కృష్ణాదేవిపేట, జూన్ 30: మండలంలోని పాత కృష్ణాదేవిపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సిగంపల్లి జోగినాయుడు పదవీ విరమణ సందర్భంగా ఆదివారం ఆయనను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు డి.గోపీనాథ్, కురస వెంకటరమణ, గండేపల్లి శ్రీరామ్మూర్తి, లోవ రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పూర్వ వైభవం!

... 3వ పేజీ తరువాయి

వచ్చింది. చంద్రబాబు అధికారం లోకి రావడంతో మళ్లీ బీసీ, ఎస్సీ మైనారిటీ సంక్షేమ శాఖలు పూర్వ వైభవం దిశగాఅడుగులు వేస్తాయని అంతా భావిస్తున్నారు.

ఇవీ హామీలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు అనేక సామాజిక వర్గాల వారికి ఆర్థికంగా సాయం అందిస్తామని ప్రకటించారు. గతంలో మాదిరిగా సబ్సిడీ రుణాలతో పాటు స్వయం ఉపాధికి వీలుగా వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు సహకరిస్తామన్నారు. సబ్సిడీపై కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు అందిస్తామన్నారు. చేతివృత్తులను ప్రోత్సహించేందుకు నాణ్యమైన పరికరాలను అందజేయడంతో పాటు కుల సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంఘాలకు కూడా సబ్సిడీ రుణాలిచ్చి ఉత్పాదక పరిశ్రమలు ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. వీటిపై ఆయా వర్గాలు ఆశలు పెంచుకుంటున్నాయి.

పింఛన్లపై అవగాహన పెంపొందించండి : సూర్యనారాయణ

దేవరాపల్లి, జూన్ 30 : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా పెరిగిన పెన్షన్‌పై అవగాహన కలిగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమి రెడ్డి సూర్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అంతా పాల్గొనాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన పెన్షన్ మొత్తం, కూటమి సర్కారు పెంచి అందిస్తున్న పింఛను మొత్తంపై అందరికీ వివరించాలని ఆయన సూచించారు.

విద్యాశాఖలో వింత పోకడ

... 3వ పేజీ తరువాయి

ఆడిట్ చేయించుకోవాల్సి ఉంటుంది. రెండు కేంద్రాల్లో 704 పాఠశాలల రికార్డులను ఆడిట్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ మండల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. జూలై 1న నర్సీపట్నం, గొలుగొండ, కోటవురట్ల, మాకవరపాలెం, నక్కపల్లి, నాతవరం, పాయకరావుపేట, రావికమతం, రోలుగుంట, ఎస్.రాయవరం, మాడుగుల, ఎలమంచిలి మండలాల రికార్డులను పరిశీలిస్తారు. జూలై 2న కశింకోట, అనకాపల్లి, అచ్యుతాపురం, బుచ్చెయ్యపేట, చీడికాడ, చోడవరం, దేవరాపల్లి, కె.కోటపాడు, మునగపాక, పరవాడ, రాంబిల్లి, సబ్బవరం మండలాల పాఠశాలల రికార్డులను పరిశీలించనున్నారు.

సంక్షిప్తంగా..

ప్రతి ఒక్కరికి కుల ధ్రువీకరణ పత్రాలు

దేవరాపల్లి, జూన్ 30 : ప్రతి కుటుంబ సభ్యుడికి కుల ధ్రువీకరణ పత్రాలు సుమోటోగా జారీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో 5,200 మంది కుల ధ్రువీకరణ పత్రాలు పొందని వారు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి జాబితా వచ్చిందని చెప్పారు. వీఆర్వోలకు సమాచారం సేకరించాలని ఆదేశించినట్లు తెలిపారు. రేషన్ కార్డుతో పాటు ఆధార్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ కుల ధ్రువీకరణ పత్రాలు సుమోటోగా అందించనున్నట్టు చెప్పారు. ఐదేళ్ల నుంచి ఇప్పటి వరకూ కుల ధ్రువీకరణ పత్రం పొందని వారు అర్హులన్నారు.

'హామీల అమలు చంద్రబాబు ఘనత'

చీడికాడ, జూన్ 30 : ఎన్నికల హామీలను నిలబెట్టుకున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని మాజీ ఎంపీపీ పాత్రిని సింహాచలంనాయుడు అన్నారు. మండలంలోని తురువోలులో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ బీశ్ల కోటేశ్వరరావుతోపాటు పలువురు టీడీపీ నాయకులతో ఆదివారం కలిసి విలేఖరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం అన్ని రకాల పింఛన్లు కలిపి 8775 మందికి రూ.5 కోట్ల 75 లక్షల 84 వేల 500లు అందుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం తమ ఆస్తులను దానం చేస్తూ నిజాయితీకి మారుపేరు అయిన అశోక్ గజపతిరాజుకి టీటీడీ చైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాత్రిని జగన్, బొడ్డు శ్రీరామ్మూర్తి, పాత్రిని సురేష్, కురచా సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

10,797 మందికి పింఛన్లు : తహసీల్దార్

బుచ్చెయ్యపేట, జూన్ 30 : మండలంలో ప్రతిష్టాత్మకంగా పింఛన్ పంపిణీని చేపట్టనున్నట్టు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మొత్తం 35 గ్రామ పంచాయతీల్లో 35 మంది ప్రత్యేకాధికారులను నియమించామన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు మూడు వేలు, పెంచిన నెల పింఛన్ రూ.4 వేలు మొత్తం రూ.7 వేలు నగదు లబ్ధిదారులకు పంపిణీ అందించనున్నట్టు చెప్పారు. మండలంలో మొత్తం 10 వేల 797 మంది లబ్ధిదారులకు రూ.7 కోట్ల 27 లక్షల, 38 వేల నగదును పంపిణీ చేస్తామని తహసీల్దార్ వెల్లడించారు.

సాయిచంద్రకు అభినందనలు


అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ, జూన్ 30 : కసిరెడ్డి సాయిచంద్ర మరింత ఉన్నత స్థాయి కి ఎదగాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని అర్జునగిరి గ్రామానికి చెందిన వ్యాయామఉపాధ్యాయుడు కసిరెడ్డి ప్రసాద్ కుమారుడు సాయిచంద్ర కిరణ్ నాయుడుకి జేఈఈ అడ్వాన్స్‌లో ఆలిండియాలో 333వ ర్యాంకు, మెయిన్స్‌లో 102 ర్యాంకు సాధించాడు. గౌహతిలో ఐఐటీ సీటు సంపాదించాడు. ఈ సందర్భంగా ఈ విద్యార్థిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అభినందించారు. విద్యార్థి తల్లి మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ, టీడీపీ నాయకులు కసిరెడ్డి గణపతి, యర్రా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహన డ్రైవ్ : ఎస్ఐ దామోదర్

మాడుగుల, జూన్ 30 : పద్దెనిమిది ఏళ్ల నిండని మైనర్లు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని మాడుగుల ఎస్ఐ పి.దామోదరనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అత్యధిక శాతం 18 ఏళ్ల నిండని వారికి తల్లితండ్రులు వాహనాలు నడిపేందుకు ఇస్తున్నారని, దానివల్ల ప్రమాదాలు జరిగుతున్నాయన్నారు. వీటి నియంత్రణకు సోమవారం నుంచి ప్రత్యేక వాహన డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా వాహనాలు నడిపే వారికి లైసెన్స్‌లు లేకపోయినా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

'అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి'


నరసింహమూర్తి

రోలుగుంట, జూన్ 30 : మండలంలోని రోలుగుంటలో మండల సమాఖ్యలో వికలాంగుల సామాజిక పెట్టుబడి నిధి (సీఐఎఫ్) దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర కార్యదర్శి నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ రోలుగుంట సమాఖ్యలో రూ.46 లక్షల వరకు నిధులు వికలాంగులకు అందించకుండా బినామీల పేర్ల మీద కొంత మంది అధికారులు కాజేశారని ఆరోపించారు. ఏడాదిన్నర క్రితం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమాలు నిర్ధారించి అప్పట్లో పని చేసిన ఉద్యోగులను బాధ్యులను చేసి నివేదికలను అందించినా నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలోనైనా ఈ అక్రమాలపై దృష్టి సారించాలని కోరారు.

జుత్తాడలో ఘనంగా నగర సంకీర్తన


కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

చోడవరం, జూన్ 30 : మండలంలోని జుత్తాడ గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు సుప్రభాత కీర్తనలు, వేంకటేశ్వర నామస్మరణలతో గ్రామంలో సందడి నెలకొంది.ఈ కార్యక్రమం అర్చకులు గోవర్ధనం చక్రధరాచార్యులు, సుదర్శన సీతారామాచార్యులు, వల్లబవరుపుల నరసింహమూర్తి పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో జుత్తాడ గ్రామస్థులతో పాటు, పట్టణంలోని ఎడ్లవీధి, లక్ష్మమ్మతల్లి ఆలయం, నౌడువీధి, కేశవ స్వామి కోవెల పరిధిలోని మహిళా భక్తులు తరలివచ్చారు.